క్లుప్తంగా

వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము విడుదల

పెనమలూరు: పెనమలూరు మండలం తాడిగడప మున్సిపాలిటీకి సంబంధించి వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందని అధికారులు తెలిపారు. సోమవారం వివరాలు తెలుపుతూ మండల పరిధిలో మొత్తం 18,563 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా వారికి ప్రభుత్వం రూ.5,16,92,500 సొమ్ము మంజూరు చేసి విడుదల చేసింది. వీటిలో పెనమలూరు మండలంలో 5745 మందికి రూ.1,58,91,850, తాడిగడప మున్సిపాలిటీలో 12,818 మందికి రూ.3,58,01,250 చొప్పున సొమ్ము మంజూరు చేసింది. లబ్ధిదారులకు నవంబర్ 1వ తేదీన వలంటీర్లు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తారు.

చెస్ పోటీల్లో కానూరు విద్యార్థుల ప్రతిభ



పెనమలూరు: సీబీఎస్ సౌత్ జోన్ చెస్ పోటీల్లో కానూరు విద్యార్థులు సత్తా చాటారు. కానూరు స్కాట్స్పెస్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు పెద్దాపురంలో జరిగిన సీబీఎస్ సౌత్‌జోన్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో కె.శార్య, ఆర్.తేజవజ్రాక్ష, యు.రిత్విక్, యు.దివ్యాంష్ ప్రథమ, తృతీయ స్థానం పొందారన్నారు. ఈ పోటీల్లో 47 జట్లకు గాను 188 మంది విద్యార్థులు పాల్గొనగా కానూరు విద్యార్థులు తమ సత్తాచాటారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, కోచ్‌ను పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, అకడమిక్ హెడ్ రమా, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఈడుపుగల్లులో పాడి రైతుల అవగాహన సదస్సు

కంకిపాడు:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై ఈనెల 31న ఈడుపుగల్లు పంచాయతీ కార్యాలయంలో పాడిరైతులకు అవగాహన సదస్సు, రుణమేళా నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ కర్నాటి మాధవరావు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. పాల వెల్లువ కార్యక్రమం అమలు, రైతుకు దక్కే ధర, కల్పిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఔత్సాహిక రైతులకు రుణమేళా, ఒప్పంద ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: సీజనల్ వ్యాధులు అరికట్టడానికి పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో సోమవారం ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతంలో సైడు డ్రెయిన్లను పూడిక తీయించి, చెత్తను తొలగించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ పారుదల నోచుకోని డ్రెయిన్లను గుర్తించి పూడిక తీయించినట్లు వివరించారు. అంతర్గత రహదారుల్లోని చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించి డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాలు, మురుగునిల్వ ఉన్న ప్రాంతాలు, అంతర్గత రహదారుల్లో దోమల మందు పిచికారీ చేయించి బ్లీచింగ్ చల్లించినట్లు వివరించారు. ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి ఫీవర్ సర్వేలు చేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్‌ల ద్వారా సురక్షిత తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు.

కుటుంబ తగాదాల నేపథ్యంలో దాడి

పెనమలూరు: పోరంకిలో కుటుంబ తగాదాల కారణంగా దాడి జరగటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం ప్రకారం పోరంకి నారాయణపురం కాలనీకి చెందిన చాళ్ల హేమంత్ 2021లో కైకలూరు మండలం ఆళ్లపాడు గ్రామానికి చెందిన లక్ష్మీకీర్తిని వివాహం చేసుకున్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో మూడు నెలల క్రితం లక్ష్మీకీర్తి పుట్టింటికి వెళ్లిపోయింది. వీరి మధ్య వివాదం ముదరటంతో లక్ష్మీకీర్తి, ఆమె తండ్రి బండి విష్ణువర్ధన్‌రావు, తల్లి రాజేశ్వరి, ఇతర బంధువులు ఆర్.సురేష్, రమా, జక్కంపూడి కిరణ్, రాజేష్ మరికొందరు పోరంకిలో హేమంత్ ఇంటికి వచ్చి అతనిపై అతని తల్లి లక్ష్మీకుమారి, తండ్రి వెంకటనాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ దాడి ఘటనపై హేమంత్ తల్లి లక్ష్మీకుమారి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

నేషనల్ గేమ్స్‌కి ఎంపికైన నలంద విద్యార్థి విస్సంశెట్టి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):గోవాలో జరుగుతున్న నేషనల్ గేమ్స్ రన్నింగ్ రిలే పోటీల్లో తమ కళాశాలలో బీబీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విస్సంశెట్టి ఖగ విశాల్ ఎంపికయ్యాడని నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు.

జంక్షన్‌లో శరవేగంగా నిర్మాణాలు

- సుమారు 1.23 ఎకరాల విస్తీర్ణంలో నూతన బస్టాండ్ నిర్మాణం
- రెండు నెలల్లో నూతన ప్రాంగణంలోకి మారనున్న కేడీసీసీబీ బ్రాంచి
- రూ.50 లక్షల వ్యయంతో పోలీస్ సర్కిల్ కార్యాలయం నిర్మాణం



దాదాపుగా నిర్మాణం పూర్తయిన హనుమాన్‌జంక్షన్ నూతన బస్టాండ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రోజురోజుకూ దినదినాభివృద్ధి చెందుతున్న హనుమాన్‌జంక్షన్ పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన శరవేగంగా జరుగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్, కేడీసీసీ బ్యాంకు, పోలీస్ సర్కిల్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణాలు దాదాపుగా తుదిదశలో ఉన్నాయి.

రూ.4.40 కోట్లతో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని హనుమాన్‌జంక్షన్‌లోని ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు సమూలంగా మారిపోతున్నాయి. 1966లో నిర్మించిన ప్రస్తుత బస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రూ.4.40 కోట్ల వ్యయంతో నూతన బస్టాండ్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ఏడు బస్టాండ్లను అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ఇంటిగ్రేటెడ్ బస్‌స్టేషన్లుగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన కార్యాచరణలో భాగంగా హనుమాన్‌జంక్షన్‌ను కూడా ఎంపిక చేయడం గమనార్హం. సుమారు 1.23 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్ నూతన భవన సముదాయాలను నిర్మించనుండగా, హైవేకు ఆనుకుని ఉన్న 20,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో వ్యాపార, వాణిజ్య సముదాయం ఏర్పాటు చేయనున్నారు. రోజుకూ దాదాపు 1000కు పైగా బస్సుల రాకపోకలు, 5 వేల మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఈ బస్‌స్టేషన్ బహుళ ప్రయోజన కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. నూతన బస్టాండ్‌లో పది ప్లాట్‌ఫాంలతో పాటుగా కార్యాలయం, బస్‌పాస్ కౌంటర్, డ్రైవర్ల విశ్రాంతి గది, ఎనిమిది షాపులు, హోటల్, కొరియర్ గది ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నూతన బస్టాండ్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది.



తుది మెరుగులు దిద్దుకుంటున్న పోలీస్ సర్కిల్ కార్యాలయం

రూ.2.8 కోట్ల వ్యయంతో కేడీసీసీబీ నూతన ప్రాంగణం

దశాబ్దాల కాలంగా అద్దె భవనంలోనే కొనసాగుతున్న కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌కు త్వరలో నూతన సొంత భవనం ఏర్పాటు కానుంది. దీని కోసం విజయవాడ రోడ్డులో రూ.1.53 కోట్ల వ్యయంతో 17.50 సెంట్ల స్థలాన్ని కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు కొనుగోలు చేసింది. ఆ స్థలంలో రూ.1.27 కోట్ల వ్యయంతో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మరో రెండు మాసాల్లో నూతన ప్రాంగణంలోకి కేడీసీసీబీ హనుమాన్ జంక్షన్ శాఖను మార్చేందుకు ప్రణాళికతో అధికారులు ఉన్నారు.



నిర్మాణంలో ఉన్న కేడీసీసీ బ్యాంకు భవనం

పోలీస్ సర్కిల్ కార్యాలయానికి నూతన భవనం

దశాబ్దాలుగా అద్దె గదిలో కొనసాగుతున్న హనుమాన్ జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి నూతన భవనం సిద్ధమవుతోంది. స్థానిక హనుమాన్ నగర్‌లో బాపులపాడు గ్రామ పంచాయతీకి చెందిన 10 సెంట్ల స్థలాన్ని పోలీస్ సర్కిల్ కార్యాలయానికి కేటాయించారు. దాతల విరాళాలతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయం నిర్మాణం చేపట్టారు. రెండు అంతస్తుల భవన నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. మరో నెల రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి కన్వీనర్‌గా పలువురు ప్రజాప్రతినిధులతో భవన నిర్మాణ కమిటీని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ పర్యవేక్షణలో సీఐ కార్యాలయ నిర్మాణం చకచకా సాగుతోంది.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన



కేసరపల్లి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్యులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. వైద్య సేవలు కోసం వందలాది మంది ప్రజలు తరలివచ్చారు. తొలుత క్యాంప్‌ను సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, ఇతర ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ...ప్రజల విద్య, వైద్యం, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ప్రతి సచివాలయంలో సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేసిన అన్ని రకాల వైద్య సేవలను అందించడం ప్రశంసనీయమన్నారు. ప్రజల ఆరోగ్య భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీమోహన్‌ను నిండు మనస్సుతో ఆశీర్వాదించాలని కోరారు. ఈ క్యాంప్‌లో 1,414 మందికి వైద్య సేవలందించినట్లు ఎంపీడీఓ సత్యకుమార్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు శొంటి కిషోర్, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ కరిముల్లా, వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు బొడ్డు అంజనేయవరప్రసాద్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు ఉత్పత్తి చేయాలి



కేసీపీ ఆడిటోరియంలో చెరకు వంగడాలను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఉయ్యూరు: అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలను ఉత్పత్తి చేయాలని వక్తలు సూచించారు. పట్టణంలోని కేసీపీ ఆడిటోరియంలో అడుసుమిల్లి గోపాలకృష్ణ జ్ఞాపకార్థం చెరకు రైతుల ఎండోమెంట్ లెక్చర్ సోమవారం నిర్వహించారు. కేసీపీ యూనిట్ హెడ్ వై.సీతారామదాసు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ చెరకు పరిశోధనా స్థానం డైరెక్టర్ డాక్టర్ ఆర్.విశ్వనాథన్, సుగర్ అండ్ కేన్ కమిషనర్ డాక్టర్ వి.వెంకట్రావు, ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆదిలక్ష్మి, పలువురు శాస్త్రవేత్తల బృందం పాల్గొన్నారు. రైతులకు అధిక దిగుబడి అందించే వంగడాలపై పరిశోధనలు ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ జి.ముత్యాలు, జీఎం కేన్ వీవీ పున్నారావు, డీజీఎం ఆర్.సూర్య, రైతు నాయకులు పాల్గొన్నారు.

వైద్యఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న కాకాని వెంకటేశ్వరరావు, ఆయన కుమార్తె భాగ్యలక్ష్మి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిరాణా వ్యాపారి అంత్యం గుప్తా కుమార్తె తనూజ వైద్యఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఆర్థికసాయాన్ని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, అరుణ దంపతులు అందజేశారు. ఈ మొత్తాన్ని తనూజ బాబాయి అంత్యం రాజాకు కాకాని వెంకటేశ్వరరావు కుమార్తె భాగ్యలక్ష్మి చేతుల మీదగా సోమవారం అందించారు.

అక్కినేని భావినటులకు మార్గదర్శకం



విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నటజీవితం భావి నటులకు మార్గదర్శకమని సీనియర్ గాయకుడు చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని రంగస్థలం నుంచి సినీ రంగానికి వెళ్లి స్వయం కృషి, పట్టుదలతో తెలుగు సినిమా గర్వించే స్థాయికి ఎదిగినట్టు చెప్పారు. అనంతరం డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు రూపాశ్రీ, విష్ణు ప్రియ, సుధా శ్రీనివాస్, వాసిరెడ్డి శ్రీనివాస్, రసూల్‌బాబు, సత్యవర్ధన్, సుశీల్ కుమార్ అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు.

రూ.24 లక్షలతో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీటిని పంపిణీ చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని పెరికీడు సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్ అన్నారు. బాపులపాడు పెరికీడులో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.24 లక్షల వ్యయంతో చేపట్టిన తాగునీటి సరఫరా పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలోని వసంతవాడ రోడ్డు నుంచి చింతా సీతయ్య కాలేజీ, రామాలయం ఏరియా వరకు పైపులైన్లు వేసి, కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ జాన్ ప్రకాష్ తెలిపారు. పైపులైను ఏర్పాటుకు పూజా కార్యక్రమాలను నిర్వహించి పొక్లెయిన్ ద్వారా పనులను ప్రారంభించారు.

కమ్యూనిటీ హాలు మరమ్మతులకు కలెక్టర్ ఆదేశం

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కులో ఉన్న కమ్యూనిటీ హాలు మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుకు కమ్యూనిటీ హాలు పరిస్థితిని వివరించామని, భవనం శ్లాబ్ పునర్ నిర్మాణం చేయడంతో పాటు టాయిలెట్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులు చేయాలని కోరినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తిపై స్పందించి మరమ్మతులు చేసేందుకుగాను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు

పెనమలూరు: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నామని పోరంకి ఇండేన్ గ్యాస్ యజమాని బోడె మాధవి తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉండాలని, గతంలో గ్యాస్ కనెక్షన్ ఉండకూడదని చెప్పారు. మహిళలకు గ్యాస్ కనెక్షన్ ఇస్తామని, భార్యభర్తల ఆధార్‌కార్డుల జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్ తీసుకురావాలన్నారు. గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వారికి రూ.300 సబ్సిడీ పై గ్యాస్‌బండ ఇస్తామన్నారు. పోరంకిలో తమ కార్యాలయం పని వేళల్లో వచ్చి గ్యాస్ కనెక్షన్‌లు తీసుకోవచ్చని వివరించారు.

టేబుల్ టెన్నిస్‌లో సత్య వెంకటేష్‌కు ప్రథమ స్థానం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఇటీవల అనంతపూర్‌లోని ఆర్‌డీటీ జూడో ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏపీ స్టేట్ ఇంటర్‌డిస్ట్రిక్ అండ్ స్టేట్ చాంపియన్ షిప్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్-2023లో తమ కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థి పీవీ పవన్ సత్య వెంకటేష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించాడని శారదా విద్యాసంస్థల జనరల్ మేనేజర్ జీవీ రావు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలోని కళాశాల ఆవరణలో పవన్ సత్య వెంకటేష్‌ను సోమవారం అభినందించారు. విద్యార్థులు అటు చదువుతో పాటుగా క్రీడలపై కూడా ఆసక్తిని చూపించాలని శారద విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, శారద విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి తెలిపారు. కళాశాల సలహాదారుడు ఈయస్ఆర్‌కే.ప్రసాద్‌తో పాటుగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పవన్ సత్య వెంకటేష్‌ని అభినందించారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ నగేష్ ఆగ్రహం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నగేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మండల పరిషత్ సమావేశానికి గైర్హాజరు అవుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్ మండిపడ్డారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పలు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకాకపోవటంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడితో రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలోనూ ఇరిగేషన్ ఏఈ మండల పరిషత్ సమావేశానికి రాకపోవటంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఇరిగేషన్ ఏఈకి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో కె.జోగేశ్వరరావును ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, డెప్యూటీ తహసీల్దార్ కె.వెంకట రమణ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నందమూరులో పౌర హక్కుల దినోత్సవం



నందమూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ తమకు ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. నందమూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ డి.వనజాక్షి మాట్లాడుతూ ప్రజలు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉన్నపుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. గ్రామాల్లో అంటరానితనం వంటి అమానుష చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం కలిగి ఉండాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వం కేటాయించిన పథకాలను తెలుసుకోవాలని అన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్ర పటాలకు పూల మాలలను వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఎస్ఐ జి.రాజు, కార్యదర్శి పిచ్చియ్య, వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే సీఎం జగన్ ఉద్దేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, వేదికపై జెడ్పీటీసీ సువర్ణరాజు, సర్పంచి సరళ

నున్న(విజయవాడరూరల్): రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. సోమవారం నున్న గ్రామ సచివాలయం 3 లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దేశంలో మరెక్కడా జరగడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకుంటే ప్రజలకు మరింత మంచి జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ కె.సువర్ణరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులతో అనేక సహాయ కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. సర్పంచి కాటూరి సరళ, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైద్యాధికారి విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో అప్రమత్తం

ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మిదిలీష్ యాదవ్



విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పెనమలూరు: ప్రకృతి వైపరీత్యాల కారణంగా తలెత్తే ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ప్రమాదం నుంచి బయటపడాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మిదిలీష్ యాదవ్ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల నుంచి బయటపడటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో గ్యాస్ సిలెండర్ ప్రమాదాల విషయంలో కూడా జాగ్రత్త వహిస్తే ప్రమాదాలు నివారించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నుంచి బయటపడే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆర్.మద్దిలేటి, హెచ్ఎం వై.దుర్గాభవాని, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోలవెన్ను విద్యార్థుల ఎంపిక



కె.భార్గవి



సీహెచ్ అనుష్క


కంకిపాడు: జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కోలవెన్ను జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం బి.నాగవల్లి సోమవారం వివరాలను తెలిపారు. గుడివాడ పట్టణంలో సోమవారం అండర్-17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయని, ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు కె.భార్గవి, సీహెచ్ అనుష్క ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో అన్నమయ్య జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థినులను జెడ్పీటీసీ బాకీ బాబు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ సీహెచ్ సురేష్, ఉపసర్పంచ్ కె.చిన్ని, వ్యాయామ ఉపాధ్యాయిని సీహెచ్ సుశీల ప్రత్యేకంగా అభినందించారు.

బ్యాడ్మింటన్‌లో సిద్ధార్థ విద్యార్థిని సత్తా



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల గోవాలో జరిగిన 37వ నేషనల్ గేమ్స్‌లో ఉమెన్ బాడ్మింటన్‌లో ఆంధ్రప్రదేశ్ టీమ్‌లో కీ ప్లేయర్‌గా సిద్ధార్థ విద్యార్థిని టి.సూర్య చరిష్మ సత్తా చాటింది. ఆ పోటీల్లో బ్రాంజ్ మెడల్ పొందిన చరిష్మను సోమవారం శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పద్మజ , ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



తోట్లవల్లూరు: ఇసుకను అక్రమంగా రవాణ చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న ఘటన మండలంలోని రొయ్యూరులో జరిగింది. గ్రామంలోని పలు ప్రదేశాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఎస్ఐ పి.విశ్వనాథ్ సోమవారం ఉదయం పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను ఆయన తహసీల్దార్ కార్యాలయానికి తరలించి అప్పగించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్

90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)

Office mail : sakshiads@gmail.com